మెదక్ | సంగారెడ్డి | సిద్దిపేట
వార్త

## రాష్ట్ర సివిల్ సప్లై కమిషనర్ దేవేందర్‌సింగ్ చౌహాన్‌ను కలిసిన ఆనంద్‌కుమార్



**మెదక్ అర్బన్, జనవరి 2 ప్రభాతవార్త:** తెలంగాణ రాష్ట్ర సివిల్ సప్లై కమిషనర్ దేవేందర్‌సింగ్ చౌహాన్‌ను మంగళవారం రేషన్ డీలర్ల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు, మెదక్ జిల్లా అధ్యక్షులు ఆనంద్ కుమార్ హైదరాబాద్‌లోని సివిల్ సప్లై భవన్‌లో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. అలాగే డీలర్ల సమస్యలపై చర్చించడం జరిగింది. ఈ కార్యక్రమంలో రేషన్ డీలర్ల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## ఇస్నాపూర్ వరకు మెట్రో విస్తరించాలి

**-బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు గోదావరి**

**రామచంద్రాపురం, జనవరి 2, ప్రభాతవార్త:** ఇస్నాపూర్ వరకు మెట్రో రైలును విస్తరిస్తే ఉద్యోగులు, కార్మికులు, ప్రజలకు ఎంతగానో సౌకర్యవంతంగా ఉంటుందని భారతీయ జనతా పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు గోదావరి అంజిరెడ్డి సూచించారు. మంగళవారం ఆమె మాట్లాడుతూ మియాపూర్ నుంచి పటాన్‌చెరు మీదుగా ఇస్నాపూర్‌వరకు మెట్రోలైన్ విస్తరించాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి కోరామన్నారు. రెండోదశలో మియాపూర్ నుంచి రామచంద్రాపురంవరకు మెట్రోను పొడగిస్తామని ముఖ్యమంత్రి పేర్కొనడాన్ని స్వాగతిస్తున్నామన్నారు. మెట్రోను ఇస్నాపూర్ వరకు పొడగిస్తే కలిగే ప్రయోజనాలపై వివరించారు. గత ప్రభుత్వం చేసిన హామిని గోదావరి ఈ సందర్భంగా గుర్తు చేశారు. మెట్రో రైలును ఇస్నాపూర్‌వరకు పొడగిస్తే ట్రాఫిక్, పొల్యూషన్ సమస్యలు తగ్గడం తథ్యమన్నారు. ఇస్నాపూర్ మార్గ నిర్మాణానికి అధిక ప్రాధాన్యత ఇవ్వాలని గోదావరి అంజిరెడ్డి డిమాండ్ చేశారు. ప్రభుత్వం మెట్రోను విస్తరణను విస్మరిస్తే బిజెపి తరఫున పోరాటం చేయాల్సి వస్తుందని హెచ్చరించారు.



టి.గెజిటెడ్ అధ్యాపకుల అసోసియేషన్ లోగోను ఆవిష్కరిస్తున్న దృశ్యం

## విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించాలి

**ఎమ్మెల్యే హరీష్‌రావు**

**సిద్దిపేట, ప్రభాతవార్త ప్రతినిధి :**

ప్రభుత్వ కళాశాలల్లో చదువుతున్న విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించాలని మాజీ మంత్రి, ఎమ్మెల్యే తన్నీరు హరీష్‌రావు సూచించారు. మంగళవారం ఆయన క్యాంపు కార్యాలయంలో తెలంగాణ గెజిటెడ్ అధ్యాపకుల అసోసియేషన్ లోగోను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇంటర్ ఫలితాల్లో సిద్దిపేటను ముందు వరుసలో నిలపాలన్నారు. అధ్యాపకులు నిబద్ధతతో ప్రత్యేక తరగతులు తీసుకోవాలని చెప్పారు. ఇటీవల హైదారాబాద్ పిఆర్‌టియు రాష్ట్ర కార్యాలయంలో జరిగిన తెలంగాణ గెజిటెడ్ అధ్యాపకుల అసోసియేషన్ ఎన్నికల్లో ఏకగ్రీవంగా ఎన్నికైన రాష్ట్ర అధ్యక్షుడు కనకచ ంద్రం, ప్రచార కార్యదర్శి పరాంకుషం నాగేందర్, అధికారప్రతినిధి నంట శ్రీనివాస్‌రెడ్డి, జిల్లా అధ్యక్షుడు గిరిరవి, ప్రధాన కార్యదర్శి దరిపల్లి నగేష్, కోశాధికారి దుబ్బాక రాజు, మహిళా కార్యదర్శి జ్యోతిలకు శుభాకాంక్షలు తెలిపి సన్మానించారు. ఈ సందర్భంగా నూతన అసోసియేషన్ హరీష్‌రావుకు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో అసోసియేషన్ నాయకులు గంగాధర్, భరత్, బీమ్‌రావు తదితరులు ఉన్నారు.

## గెజిటెడ్ లెక్చరర్ సంఘం జిల్లా అధ్యక్షుడిగా శ్రీనివాస్

**పాపన్నపేట, జనవరి 2, ప్రభాతవార్త:** తెలంగాణ గెజిటెడ్ లెక్చరర్ సంఘం(711) మెదక్ జిల్లా అధ్యక్షులుగా గాండ్ల శ్రీనివాస్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. పాపన్నపేటలోని జూనియర్ కళాశాలలో వృక్ష శాస్త్ర అధ్యాపకులుగా సేవలు అందిస్తున్న శ్రీనవాస్‌ను అధ్యక్షులుగా, కార్యదర్శిగా సురేందర్(కౌడిపల్లి కళాశాల రసాయన శాస్త్రం)లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు సంఘం రాష్ట్ర అధ్యక్షులు కనక చంద్రం తెలిపారు. లెక్చరర్ల సమస్యల పరిష్కారం కొరకు శక్తి వంచన లేకుండా తమ వంతు కృషి చేస్తామని శ్రీనివాస్, సురేందర్‌లు పేర్కొన్నారు.

## మంత్రికి స్వాగతం పలికిన మాజీ మంత్రి



దామోదర్ రాజనర్సింహకు స్వాగతం పలుకుతున్న మాజీ మంత్రి

**జహీరాబాద్, జనవరి 2, ప్రభాతవార్త:** నియోజకవర్గంలోని న్యాల్‌కల్ మండలంలోని బసంత్‌పూర్ గ్రామంలో నిర్వహించిన ప్రజాపాలన గ్రామసభలో పాల్గొనేందుకు వెళుతున్న రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహాను జహీరాబాద్‌లో మాజీ మంత్రి, నియోజకవర్గ కాంగ్రెస్ చీఫ్ కో-ఆర్డినేటర్ డాక్టర్ చంద్రశేఖర్ పార్టీ నాయకులతో కలిసి స్వాగతంపలికారు. మంత్రికి పుల బొకేను అందించి సాదరంగా స్వాగతించారు. కార్యక్రమంలో మాజీ ఎంపి సురేశ్‌కుమార్ శెట్కార్, నాయకులు కొత్తపల్లి భాస్కర్‌రెడ్డి ఉన్నారు.

**మంత్రికి స్వాగతం పలికిన ఎమ్మెల్యే...**

న్యాల్‌కల్ మండలంలోని బసంత్‌పూర్ గ్రామంలో నిర్వహించిన ప్రజా పాలన గ్రామ సభలో పాల్గొనేందుకు వెళుతున్న రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహాను ఎమ్మెల్యే కొనింటి మాణిక్‌రావు జహీరాబాద్‌లో మంత్రికి ఘనంగా స్వాగతం పలికారు. మంత్రి దామోదర్ రాజనర్సింహాను పూలమాలలు, శాలువాలతో సత్కరించి సాదరంగా ఎమ్మెల్యే ఆహ్వానించారు.

## మిడ్ డే మీల్స్ బిల్స్ వెంటనే విడుదల చేయాలి

**ఎస్టీయు జిల్లా ప్రధాన కార్యదర్శి కర్రె పోచయ్య**



మాట్లాడుతున్న ఎస్టీయు జిల్లా ప్రధాన కార్యదర్శి కర్రె పోచయ్య

**రామాయంపేట, జనవరి 2, ప్రభాతవార్త :** జిల్లాలోని వివిధ పాఠశాలలలో వంట చేసే కార్మికులకు ఆగస్టు 2023 నుండి నేటి వరకు వివిధ రకాల బిల్స్ రాలేదు. వంట చేసే కార్మికులు అప్పులు తెచ్చి ఐదు నెలల నుండి వంటలు చేస్తున్నారు. వంటలు చేస్తున్నామని వాపోతున్నారు. కావున ప్రభుత్వం వెంటనే మిడ్ డే మీల్స్ బిల్స్ విడుదల చేయాలని ఎస్టీయు టీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి కర్రె పోచయ్య ప్రభుత్వాన్ని విలేకరుల సమావేశంలో డిమాండ్‌చేశారు. అదేవిధంగా జిల్లాలోని అన్ని పాఠశాలలలో స్కావెంజర్‌లేక టాయిలెట్స్ పరిశుభ్రంగా ఉండడం లేదు. అందువల్ల పాఠశాలలోని విద్యార్థిని, విద్యార్థులకు అంటువ్యాధులచే ప్రమాదం పొంచిఉన్నందున ప్రభుత్వం దృష్టి సారించి స్కావెంజర్స్ నియమించే విధంగా చూడాలని ప్రభాత్వాన్ని ఆయన డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు గోపాల్, జహీరుద్దీన్, జిల్లా అసోసియేట్ అధ్యక్షులు శివప్రసాద్ మరియు జిల్లా ఉపాధ్యక్షులు సత్యనారాయణ మొదలగువారు పాల్గొన్నారు.

## నేడు విద్యుత్ వినియోగదారుల సదస్సు

**అల్లాదుర్గం, జనవరి 2, ప్రభాతవార్త:** మండల కేంద్రమైన అల్లాదుర్గంలో ఈ నెల 3న విద్యుత్ వినియోగదారుల సదస్సును నిర్వహిస్తున్నట్లు విద్యుత్ అధికారి శివాజీ, నవాజ్‌లు పేర్కొన్నారు. విద్యుత్ వినియోగదారులు సదస్సులో పాల్గొని సమస్యలపై సదస్సు దృష్టికి తీసుకురావాలన్నారు. మండలంలోని ఆయా గ్రామాల విద్యుత్ వినియగదారులు సదస్సులో పాల్గొని తమ సమస్యల పరిష్కారానికి సమస్యలను అధికారుల దృష్టికి తీసుకురావాలన్నారు.

# ప్రజల ముందుకే ప్రజా పాలన

**మంత్రి దామోదర్ రాజనర్సింహా**



మాట్లాడుతన్న దామోదర్ రాజనర్సింహ

**నారాయణఖేడ్, జనవరి 2 ప్రభాతవార్త:**

ప్రభుత్వమే ప్రజాపాలనగా ప్రజల ముందుకు తెచ్చిందని, ప్రజా సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యమని రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ అన్నారు. మంగళవారం సంగారెడ్డి జిల్లా నారాయణఖేడ్ మండల పరిధిలోని హన్మంతరావుపేట, నారాయణఖేడ్ మున్సిపాలిటీపరిధిలోని మన్సూర్‌పూర్‌లో నిర్వహించిన ప్రజా పాలన కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన సమావేశంలో మంత్రి దామోదర్ రాజనర్సింహ మాట్లాడుతూ ఎన్నికల్లో ప్రజలకు ఇచ్చిన హామీమేరకు కాంగ్రెస్ ప్రభుత్వం ఆరు గ్యారంటీలను ఇచ్చిందన్నారు. అందులో రెండు గ్యారంటీలను అమలు చేశామన్నారు. రాజీవ్ ఆరోగ్యశ్రీ పథకం కింద రూ. 5 లక్షల నుంచి రూ.పది లక్షల వరకు పెంపు చేశామని, రెండవది మహిళలకు ప్రవేశపెట్టిన ఉచిత బస్సు ప్రయాణ పథకాన్ని అమలు చేశామని తెలిపారు. ఇందిరమ్మ పాలించిన తరహాలోనే కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలవద్దకు పాలనను తెచ్చిందని చెప్పారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రతి పేదవారికి సంక్షేమ పథకాలు అందాలనే దృఢ నిశ్చయంతోనే ఉన్నారని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వంలోనే పేదలకు న్యాయం జరుగుతుందన్నారు. భారస ప్రభుత్వ హయాంలో ఒక రేషన్ కార్డు మంజూరు చేయలేదని తెలిపారు. ప్రజాపాలన కార్యక్రమంలో ప్రజలు దరఖాస్తులు సమర్పించేందుకు ప్రతి గ్రామంలో 100 కుటుంబాలకు ఒకకౌంటర్ చొప్పున అధికారులు ఏర్పాటు చేశారని అన్నారు. జోగిపేట, నారాయణఖేడ్, జహీరాబాద్ పట్టణాలు కాంగ్రెస్ పార్టీకి కంచుకోట అని అన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరు ఈ నెల 6వ తేదీ వరకు ప్రజాపాలనలో ఆరు గ్యారంటీలకు దరఖాస్తులు చేసుకోవాలని సూచించారు. మిగిలినవారు ఉంటే ఆయా గ్రామపంచాయతీల్లోని కార్యదర్శులను దరఖాస్తులు చేసుకోవాలనిన్నారు. జిల్లాలో ఇప్పటి వరకు ప్రజాపాలనలో లక్ష వరకు దరఖాస్తులు వచ్చాయని అన్నారు. హన్మంతరావుపేటలో ప్రజా పాలన గ్రామసభలో ప్రజల నుంచి దరఖాస్తులను స్వీకరించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే డాక్టరు పట్లోళ్ల సంజీవరెడ్డి, జహీరాబాద్ మాజీ ఎంపి సురేష్‌శెట్కార్, కలెక్టరు డాక్టరు శరత్, డీపీఓ సురేష్‌మోహన్, డీఎస్పీ వెంకటరెడ్డి, ఆర్డీఓ వెంకటేష్, తహసీల్దార్ దేవదాసు, ఎంపీడీఓ వెంకటరెడ్డి, ఎంపీపీ అధ్యక్షురాలు చాందీబాయి, సర్పంచ్ దత్తు, డీసీసీ ప్రధాన కార్యదర్శి చంద్రశేఖర్‌రెడ్డి, మాజీ ఎంపీటీసీ సుధాకర్‌రెడ్డి, కౌన్సిలర్లు దారం శంకర్‌సేట్, వివేకనంద, ప్రజలు ఆయా శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## రాష్ట్రంలో సావిత్రిబాయి, జ్యోతిపూలే విగ్రహాలు ఏర్పాటు చేయాలి

**మంత్రి సీతక్క**





సావిత్రిబాయి పూలే సంఘం జిల్లా అధ్యక్షురాలు పోచమ్మల అశ్విని శ్రీనివాస్‌ను సన్మానిస్తున్న మంత్రి సీతక్క

**రామాయంపేట, జనవరి 2, ప్రభాతవార్త :** తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా సావిత్రిబాయి, జ్యోతిపూలే విగ్రహాలను ఏర్పాటు చేయాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉందని రాష్ట్ర మంత్రి సీతక్క అభిప్రాయపడ్డారు. సావిత్రిబాయిపూలే 193వ జయంతి సందర్భంగా రవీంద్రభారతిలో నిర్వహించిన వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా మంత్రి సీతక్క సావిత్రిబాయి పూలే సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షురాలు బెల్లం మహాదేవితో కలిసి ఆదర్శ ఉపాధ్యాయురాళ్లను,పలువురు సంఘ సేవకులను, మహిళా మణులను శాలువాలతో సత్కరించి, మెమెంటోస్ అందజేయడం జరిగింది. అనంతరం మంత్రి మాట్లాడుతూ సావిత్రిబాయి పూలే జీవితాన్ని స్పూర్తిగా తీసుకొని ప్రతి ఒక్కరు ఆమె బాటలో నడుస్తూ, సేవలందించాల్సిన బాధ్యత మనందరిపైన ఉన్నదన్నారు. అలాగే ఆమె సమాజానికి చేసిన సేవలను గుర్తు చేశారు. అలాగే తమ ప్రభుత్వంలో మహిళలు పురుషులతో సమానంగా అన్ని రంగాలలో దూసుకుపోవాలని పిలుపునిచ్చారు. ఒక్క రామాయంపేటలోనే కాకుండా వీలైతే రాష్ట్ర వ్యాప్తంగా సావిత్రిబాయి పూలే విగ్రహాలను ఏర్పాటు చేయాలని సమావేశంలో పాల్గొన్న పోచమ్మల అశ్వినికి మంత్రి సీతక్క సూచించారు. ఈ విషయంలో ప్రభుత్వ పరంగా పూర్తి సహాయ సహకారాలు అందజేస్తామని చెప్పారు. ఈకార్యక్రమంలో మెదక్ జిల్లా సావిత్రిబాయిపూలే సంఘం అధ్యక్షురాలు పోచమ్మల అశ్విని శ్రీనివాస్‌తో పాటు జిల్లాల అధ్యక్షులు, ఇతర నాయకులు పాల్గొన్నారు.



దత్తగిరి ఆశ్రమంలో శాస్త్రవేత్త ఎల్లారెడ్డికి స్వాగతం పలుకుతున్న పీఠాధిపతులు

## దత్తగిరి ఆశ్రమాన్ని దర్శించుకున్న శాస్త్రవేత్త

**ఝరాసంగం, జనవరి 2, ప్రభాతవార్త:** మండలంలోని బర్దీపూర్ గ్రామంలోని దత్తగిరి ఆశ్రమాన్ని మంగళవారం ప్రముఖ శాస్త్రవేత్త పైడి ఎల్లారెడ్డి దర్శించుకున్నారు. ఆశ్రమానికి చేరుకున్న ఎల్లారెడ్డిని ఆశ్రమ మర్యాదలతో ఆశ్రమ పీఠాధిపతులు ఘనంగా స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆశ్రమంలో కొలువున్న జ్యోతిర్లింగాల వద్ద అర్చకులు వేద మంత్రాలు వల్లిస్తుండగా రుద్రాభిషేకం మహా మంగళ హారతి పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆశ్రమ పీఠాధిపతులు శాస్త్రవేత్తను శాలువాతో ఘనంగా సత్కరించి ఆశీర్వచనాలు చేశారు. ఈ సందర్భంగా శాస్త్రవేత్త పైడి ఎల్లారెడ్డి మాట్లాడుతూ గతంలో తను పరోక్షంగా ప్రజలకు సేవా కార్యక్రమాలు అందించానని, ఇక నుంచి ప్రత్యక్షంగా సేవా కార్యక్రమాలు అందించేందుకు రాజకీయ అరంగ్రేటం చేసినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో ఆశ్రమ పీఠాధిపతులు వైరాగ్య శిఖామణి అవదూతగిరి మహారాజ్ (అప్పగారు), సిద్దేశ్వరానందగిరి మహారాజ్, జహీరాబాద్, నారాయణఖేడ్, ఎల్లారెడ్డి, కామారెడ్డి ప్రాంతాలకు చెందిన నాయకులు పాల్గొన్నారు.



ప్రజాపాలన దరఖాస్తులను స్వీకరిస్తున్న అదనపు కలెక్టర్ రమేష్

## ప్రభుత్వ సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలి

**-అదనపు కలెక్టర్ రమేష్**

**కొల్చారం, జనవరి2 ప్రభాతవార్త:** రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా అదనపు కలెక్టర్ రమేష్ అన్నారు. మంగళవారం మండల పరిధిలోని రాంపూర్ గామ పంచాయతీలో నిర్వహిస్తున్న ప్రజాపాలన కార్యక్రమాన్ని ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ రమేష్ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న ప్రజా సంక్షేమ పథకాల దరఖాస్తులను స్వీకరించారు. రాష్ట్ర ప్రభుత్వం పేద ప్రజల కోసం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న పథకాలను ప్రజలందరూ సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. ఈ నెల 6వ తేదీ వరకు ప్రజాపాలన కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందని, ముందుగానే దరఖాస్తులను నింపి దరఖాస్తుల స్వీకరణ కౌంటర్‌లలో అందజేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో గణేష్‌రెడ్డి, ఎంపీవో నర్సింలు, ఏపీవో మహిపాల్‌రెడ్డి, మండల వ్యవసాయ అధికారి శ్వేతకుమారి, గ్రామ కార్యదర్శి విఠల్, బీఆర్ఎస్ నాయకులు గోవర్ధన్‌రెడ్డి, పోచయ్య తదితరులు ఉన్నారు.

# అవిశ్వాస తీర్మానం పెడదామా..!

**పెడితే సక్సెస్ అవుతామా..!**
**అంతర్‌మథనంలో పలువురు సిద్దిపేట కౌన్సిలర్లు**
**ఇప్పటికే ఓ రిసార్ట్‌లో రహస్య సమావేశం**

**సిద్దిపేట, ప్రభాతవార్త ప్రతినిధి :**

సిద్దిపేట మున్సిపల్ చైర్మన్ భర్త వ్యవహారశైలిపై పలువురు కౌన్సిలర్లు తీవ్ర అసంతృప్తిని వ్యక్తం చేస్తున్నట్లు తెలుస్తోంది. చైర్మన్ భర్త ఒంటెద్దు పోకడలు నచ్చక పలువురు కౌన్సిలర్లు చైర్మన్‌పై అవిశ్వాస తీర్మానం పెడదామన్న అంతర్‌మథనంలో ఉన్నట్లు సమాచారం. అవిశ్వాస తీర్మానం పెడితే మాత్రం సక్సెస్ అవుతామన్న ఆలోచనలో ఉన్నట్లు సమాచారం. సిద్దిపేట మున్సిపల్ పరిధిలో 43 మంది కౌన్సిల్ సభ్యులు ఉన్నారు.ఇప్పటికే పది మందికిపైగా కౌన్సిలర్లు మేడ్చల్ జిల్లా అలాహబాద్‌లోని ఓ రిస్టార్‌లో రహస్యంగా సమావేశం నిర్వహించి చర్చించినట్లు తెలుస్తుంది. మున్సిపల్ చైర మన్‌పై అవిశ్వాస తీర్మానం పెడితే తమతోపాటు మరో పది మందికి పైగా రావడానికి సిద్ధంగా ఉన్నారని అసంతృప్తిలో ఉన్న కౌన్సిలర్ల ద్వారా తెలిసింది. అవిశ్వాసానికి సరిపడ కౌన్సిలర్లను సిద్ధం చేసుకుని అవిశ్వాస తీర్మానం ప్రవేశపెట్టి సక్సెస్ చేయడానికి పావులు కదుపుతున్నట్లు తెలుస్తుంది. చైర్మన్ భర్త కౌన్సిలర్లుకు కనీస గౌరవరం ఇవ్వకుండా ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. చైర్మన్ భర్త నలుగురైదుగురు కౌన్సిలర్లను వెంటపెట్టుకొని వారికే తగిన ప్రాధాన్యత ఇస్తున్నారని మిగతా కౌన్సిలర్లను పట్టించుకోవడం లేదని వాపోతున్నారు. ఏదైనా పని మీదవెళితే కౌన్సిలర్లమన్న కనీస మర్యాద ఇవ్వకుండా ఇష్టంవచ్చినట్లు మాట్లాడతారని అవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇటీవల జరిగిన అసెంబ్లీ సాధారణ ఎన్నికల్లో సైతం కొంత మంది కౌన్సిలర్లకు పెద్దపీట వేసి తమను కనీసం పట్టించుకోలేదని వాపోతున్నారు. అవిశ్వాస తీర్మానంపై మాజీ మంత్రి, ఎమ్మెల్యే తన్నీరు హరీష్‌రావుకు తెలిసినా వెనకడుగు వేయొద్దన్న నిర్ణయానికి వచ్చినట్లు తెలుస్తుంది. సర్‌తో తమకు ఎలాంటి ఇబ్బంది లేదని కేవలం చైర్మన్ భర్త వ్యవహారశైలి నచ్చకే అవిశ్వాస తీర్మానం పెట్టాలన్న నిర్ణయించుకున్నట్లు అసంతృప్తి కౌన్సిలర్ల ద్వారా సమాచారం. అవిశ్వాసంలో నెగ్గకుంటే చివరికి పార్టీ అన్న మారదామన్న ఆలోచనలో ఉన్నట్లు తెలుస్తుంది. అసంతృప్తి కౌన్సిలర్ల అవిశ్వాస తీర్మాన ప్రయత్నం ఏ మేరకు ఫలిస్తుందో వేచి చూద్దాం మరి.



సిద్దిపేట మున్సిపల్ కార్యాలయం



బసంత్‌పూర్‌లో ప్రజా పాలనలో పాల్గొన్న దామోదర్ రాజనర్సింహా

# ఉద్యమకారులకు అండగా ఉంటాం

**-వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహా**

**న్యాల్‌కల్, జనవరి 2, ప్రభాతవార్త:** ప్రత్యేక తెలంగాణ కోసం ఉద్యమించి ఉద్యమకారులు, ప్రాణాలను తృణప్రాయంగా వదిలిన అమరవీరుల కుటుంబాలకు కాంగ్రెస్ ప్రభుత్వం అండగా ఉంటుందని రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ పేర్కొన్నారు. మంగళవారం సంగారెడ్డి జిల్లా జహీరాబాద్ నియోజకవర్గంలోని న్యాల్‌కల్ మండలంలోని బసంత్‌పూర్ గ్రామంలో నిర్వహించిన ప్రజా పాలన గ్రామ సభకు ముఖ్య అతిథిగా హాజరై ప్రజలను ధరఖాస్తులను స్వీకరించారు. ఈ సందర్భంగా మంత్రి దామోదర్ రాజనర్సింహ మాట్లాడుతూ అర్హులైన ప్రజలను కాంగ్రెస్ ప్రభుత్వం గ్యారంటీ పథకాలను అందచేయడం తథ్యమన్నారు. కాంగ్రెస్ హామిలో భాగంగా రాజీవ్ ఆరోగ్య శ్రీ పథకంలో వైద్య సేవలను 5 లక్షల నుంచి 10 లక్షల రూపాయలకు పెంచిన విషయాన్ని గుర్తు చేశారు. ప్రత్యేక తెలంగాణ కోసం ప్రాణాలను త్యాగం చేసిన అమరవీరుల కుటుంబానికి ఉద్యోగం ఇప్పించే బాధ్యత, ఉద్యమకారులకు 250 గజాల స్థం ఇచ్చి ఇల్లుకట్టించే బాధ్యత కాంగ్రెస్ ప్రభుత్వం తీసుకుంటుందన్నారు. కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ డాక్టర్ శరత్, అదనపు కలెక్టర చంద్రశేఖర్,, మాజీ ఎంపి సురేష్‌కుమార్ శెట్కార్, ఎమ్మెల్యే మాణిక్‌రావు, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు బిరేదార్ శ్రీనివాస్‌రెడ్డి, మండల యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు గుండంగారి తిరిపుతిరెడ్డి, నాయకులు కొత్తపల్లి భాస్కర్‌రెడ్డి, ఆర్‌డిఓ వెంకారెడ్డి తహసీల్దార్ భాను కిరణ్, ఎంపిడిఓ వెంకట్‌రెడ్డి, ఎంపిపి అంజమ్మ, వైస్ ఎంపిపి గౌసోద్దిన్, జడ్పీటిసి స్వప్న భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

## స్వామి వారి కళ్యాణోత్సవానికి సకల సౌకర్యాలు ఏర్పాట్లు చేయాలి

**జిల్లా కలెక్టర్ ప్రశాంత్ జీవన్‌పాటిల్**



అధికారులతో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ ప్రశాంత్‌జీవన్‌పాటిల్

**కొమురవెల్లి, జనవరి 2, ప్రభాతవార్త :** శ్రీకొమురవెల్లి మల్లికార్జున స్వామి దేవాలయంలో ఈనెల 7న నిర్వహించ తలపెట్టిన స్వామి వారి కళ్యాణోత్సవ, బ్రహ్మోత్సవాల ఏర్పాట్లను జిల్లా కలెక్టర్ ప్రశాంత్ జీవన్ పాటిల్ మంగళవారం క్షేత్రస్థాయిలో పరిశీలించారు. గుడి పక్కనే నిర్మిస్తున్న క్యూలైన్ కాంప్లెక్స్ పనులు నత్తనడకన సాగుతున్నందున అసహనం వ్యక్తం చేశారు. తాత్కాలిక పద్దతిలో అదనంగా కర్రలతో క్యూలైన్లున నిర్మించాలని సూచించారు. రైల్వేలైన్‌వద్ద బ్రిడ్జి నిర్మాణం అలస్యం అవుతున్నందున రాజీవ్‌రహదారి నుంచి వాహనాలు గౌరాయిపల్లి నుంచి కొమురవెల్లికి వచ్చేలా సైన్ బోర్డు ఏర్పాటు చేయాలన్నారు. అలయ ప్రాంగణం, చుట్టు ప్రక్కన మద్యం అమ్మే బెల్టుషాపులను మూసివేయించేలా చర్యలు తీసుకోవాలని ఎక్సైజ్ సూపరిండెంటెండ్ శ్రీనివాసమూర్తికి సూచించారు. 24 గంటలు అలయం చుట్టూ క్యూ కాంప్లెక్స్ నిరంతరాయంగా విద్యుత్ సరఫరా ఏర్పాట్లు జనరేటర్ సౌకర్యం అందుబాటులో ఉంచాలని విద్యుత్ శాఖ అధికారులను అదేశించారు. మిషన్ భగీరథ ద్వారా తాగునీటిని అందించాలన్నారు. తాగునీటికి ఇబ్బందులు రాకుండా చూడాలని సంబంధిత శాఖ అధికారికి సూచించారు. కళ్యాణ వేదిక వద్ద భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చూడాలన్నారు. ఆర్టీసి బస్టాండులో ఫ్లడ్ లైట్ అమర్చడంతోపాటు మైక్‌సెట్ ఏర్పాటుచేసి బస్సుల వివరాలను తెలియజేయాలన్నారు. గుట్టపై నిర్మించిన 50 పడకల సత్రాల నిర్మాణం త్వరగా పూర్తి చేయాలన్నారు.పిహెచ్‌సిలో అదనంగా డాక్టర్లు, సిబ్బందిని ఏర్పాటు చేసి వైద్య సేవలు అందుబాటులో ఉంచాలన్నారు. గుడి ఆవరణలో, రోడ్డు మార్గంలో 108 వాహనాలు అందుబాటులో ఉంచాలన్నారు.పారిశుధ్య పనులను వెంటనే చేపట్టడానికి తగు చర్యలు తీసుకోవాలన్నారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు రాకుండా జిల్లా యంత్రాంగం సమన్వయంతో పనిచేయాలన్నారు. కలెక్టర్ వెంట వివిధశాఖల అధికారులతో పాటు పోలీసు అధికారులు శ్రీనివాసరావు, సతీష్, బాలాజీ, సత్యనారాయణ రెడ్డి, రఘుపతిరెడ్డి, నాగరాజు అంజయ్య తదితరులు పాల్గొన్నారు.

### ఆరు గ్యారెంటీలను సద్వినియోగం చేసుకోవాలి : డీఆర్‌డీఏ పీడీ

**కొల్చారం, జనవరి2 ప్రభాతవార్త:** ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఆరు గ్యారెంటీలను అర్హులైన ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని డీఆర్‌డీఏ పీడీ శ్రీనివాస్ అన్నారు. మంగళవారం పోతంశెట్టిపల్లి గ్రామ పంచాయతీలో ప్రజాపాలన గ్రామసభకు ఆయన తనిఖీ చేశారు. గ్రామంలో ఏర్పాటు చేసిన ఆయా కౌంటర్లు పరిశీలించారు. ప్రజలు అందజేసిన ఆరు గ్యారెంటీల దరఖాస్తులను స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామంలో ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటుచేసి పంచాయతీ కార్యదర్శుల ద్వారా దరఖాస్తులను స్వీకరిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో గణేష్‌రెడ్డి, ఏపీవో మహిపాల్‌రెడ్డి, ఎంపీవో నర్సింలు, బీఆర్ఎస్ నాయకులు గడ్డమీది నర్సింలు, సిద్ధిరాములు, కొమ్ముల యాదాగౌడ్, ఆయా శాఖల అధికారులు, అంగన్వాడీ టీచర్లు, వ్యవసాయ అధికారులు, ఆశా వర్కర్లు తదితరులు ఉన్నారు.



మాట్లాడుతున్న డీఆర్‌డీఏ పీడీ శ్రీనివాస్


పాపన్నపేటలో అయోధ్య అక్షింతలను ఊరేగిస్తున్న గ్రామ భక్తులు

## పాపన్నపేటలో అయోధ్య అక్షింతల ఊరేగింపు

**పాపన్నపేట, జనవరి 2, ప్రభాతవార్త:** ఉత్తరప్రదేశ్‌లోని అయోధ్య శ్రీరామ మందిరం నుంచి మండలానికి సరఫరా అయిన అయోధ్య అక్షింతలను మంగళవారం గ్రామంలోని పురవీధుల గుండా రామనామ స్మరణ చేస్తూ భక్తి శ్రద్దల మధ్య ఊరేగించారు. గ్రామంలోని ఆంజనేయస్వామి ఆలయం నుంచ గ్రామంలోని పురవీధుల గుండా గ్రామంలోని ఈశ్వరాలయం వరకు ఊరేగింపు నిర్వహించారు. ఆలయానికి చేరుకున్న భక్తులకు తీర్థ ప్రసాదాలు అందచేశారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ గురుమూర్తి గౌడ్, నాయకులు రాజేశ్వర్‌గుప్త, నిటలాక్షప్ప, మల్లన్న, రాములు, కిష్టయ్య, కిషన్‌రెడ్డి, బాలరాజు, భూమాగౌడ్, నరేందర్‌రెడ్డి, ఉమా మహేశ్వర, యువకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## శేరిదామరగిద్దలో అయోధ్య అక్షింతల శోభాయాత్ర


శేరిదామరగిద్దలో అక్షింతలను శోభాయాత్రతో తీసుకువస్తున్న భక్తులు

**నాగల్‌గిద్ద, జనవరి 2, ప్రభాతవార్త:** మండలంలోని శేరిదామరగిద్ద గ్రామంలో మంగళవారం అయోధ్య అక్షింతలను భక్తులు శోభాయాత్ర ద్వారా ఆంజనేయస్వామి ఆలయానికి చేరుకున్నారు. శివాజీ చౌక్‌నుంచి రామనామ స్మరణ చేస్తూ హనుమాన్ ఆలయానికి భారీ ఊరేగింపుగా చేసుకున్నారు. కార్యక్రమంలో ఎంపిటిసి సభ్యులు పండరినాథ్, మారుద్రప్ప, మారుతి, సూర్య ప్రకాశ్‌రెడ్డి, చందు గణపతి, బస్వరాజ్, భద్రప్ప, శివకుమార్, రాజురెడ్డి, ప్రవీణ్, సంగు పాటిల్, పండరి, తుకారాం పాల్గొన్నారు.

## టిపిటిఎఫ్ క్యాలెండర్ ఆవిష్కరణ


టిపిటిఎఫ్ క్యాలెండర్ ఆవిష్కరణను ఆవిష్కరిస్తున్న ఉపాధ్యాయులు

**మునిపల్లి, జనవరి 2, ప్రభాతవార్త:** మండలంలోని బుదేరా చౌరస్తాలో మంగళవారం ఉదయం టిపిటిఎఫ్ క్యాలెండర్‌ను ఉపాధ్యాయుల సమక్షంలో ఆవిష్కరించారు. కార్యక్రమంలో టిపిటిఎఫ్ రాష్ట్ర కౌన్సిలర్ యండి ఖరోద్దీన్, మండల అధ్యక్షులు లక్ష్మణ్, ప్రధాన కార్యదర్శి గోపాల్, జిల్లా కౌన్సిలర్ గోవర్ధన్, నాయకులు ప్రవీణ్‌కుమార్, ఉపాధ్యాయులు శ్రీనివాస్, నరేష్, వినయ్‌కుమార్, హేమసుందర్, శ్రీరామ్, అనురాధ, అరుణ కుమారి, కవిత, సృజనకుమారి, శరణమ్మ, పూర్ణిమ పాల్గొన్నారు.

## మంత్రి శ్రీధర్‌బాబును కలిసిన మంజులరెడ్డి


ఐటి, ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్స్ శాఖ మంత్రి శ్రీధర్‌బాబును సత్కరిస్తున్న మంజులరెడ్డి

**హుస్నాబాద్, జనవరి 2, ప్రభాతవార్త :** ఐటి, ఎలక్ట్రానిక్స్, కమ్యూనికేషన్స్, ఇండస్ట్రీ, కామర్స్, శాసనసభ వ్యవహారాల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబును మంగళవారం హైదరాబాద్‌లోని ఎమ్మెల్యే క్వార్టర్స్‌లో కాంగ్రెస్ నాయకురాలు, సామాజిక సేవకురాలు కర్ణకంటి మంజులరెడ్డి మర్యాదపూర్వకంగా కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం ఆయనకు పుష్ప గుచ్చం అందించి శాలువాతో సత్కరించారు.

## శ్రీవాణి స్కూల్‌లో ఘనంగా స్వపరిపాలన


స్వయం పరిపాలన దినోత్సవ దృశ్యం

**సిద్దిపేట రూరల్, జనవరి 2, ప్రభాతవార్త:** సిద్దిపేట పట్టణంలోని భారత్‌నగర్‌లోగల శ్రీవాణి స్కూల్‌లో మంగళవారం విద్యార్థులు స్వయం పరిపాలన దినోత్సవం ఘనంగా నిర్వహించారు. స్వయం పరిపాలన దినోత్సవం సందర్భంగా తోటి విద్యార్థులే ఉపాధ్యాయులుగా వ్యవహరించి విద్యా బోధన చేశారు. స్వయం పరిపాలనలో డిఈవోగా ఎం.మనస్విని, ప్రిన్సిపల్‌గా కె.అరవింద్, కరస్పాండెంట్‌గా టి.నవనీత్‌రెడ్డిలు వ్యవహరించారు. స్వయం పాలనలో ఉత్తమ ప్రతిభను కనబర్చిన సాహితి, ఎం.డి. అప్జల్, విశాల్, ఎన్.తేజస్వనిలకు స్కూల్ డైరెక్టర్ సి.హెచ్.సత్యం చేతుల మీదుగా బహుమతులు అందించారు. అనంతరం స్కూల్ డైరెక్టర్ సి.హెచ్. సత్యం మాట్లాడుతూ ఉపాధ్యాయులుగా తమ పాత్రలపై పూర్తిస్థాయిలో అవగాహన పెంచుకున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ కృపాకర్, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

## అంబేద్కర్ సేవా సమితి క్యాలెండర్ ఆవిష్కరణ

**సంగారెడ్డి మున్సిపాలిటి, జనవరి 2, ప్రభాతవార్త:** తెలంగాణ అంబేద్కర్ సేవా సమితి నూతన సంవత్సరం 2024 క్యాలెండర్‌ను మంగళవారం ఎస్‌సి కమిషన్ గౌరవసభ్యులు సుభాష్ రామనాథ్, జాతీయ కమిషన్ డైరెక్టర్ సునీల్‌బాబులు ఆవిష్కరించారు. హైద్రాబాద్‌లోని ఎస్‌సి కమిషన్ కార్యాలయంలో ఆవిష్కరించిన క్యాలెండర్ ఆవిష్కరణ కార్యక్రమంలో తెలంగాణ అంబేద్కర్ సేవా సమితి రాష్ట్ర అధ్యక్షులు కొండాపురం జగన్, సంరెడ్డి జిల్లా ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్ కమిటి సభ్యులు పి దుర్గాప్రసాద్, సేవా సమితి జిల్లా నాయకులు జెల్ల సురేష్, యాదగిరి, అఖిల్ నాయక్, వినోద్ కుమార్ మునేష్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.


అంబేద్కర్ సేవా సమితి క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న దృశ్యం


బిడెకన్నెలో ప్రజా పాలన సభను నిర్వహిస్తున్న అధికారులు


లకుడారంలో మాట్లాడుతున్న వైస్ ఎంపిపి రవీందర్


మల్చెల్మ ప్రజా పాలన సభలో ధరఖాస్తులు స్వీకరిస్తున్న అధికారులు


పందిల్లలో దరఖాస్తులు స్వీకరిస్తున్న తహసీల్దార్ రవీందర్‌రెడ్డి


కొత్తపల్లిలో ప్రజాపాలన కార్యక్రమంలో పాల్గొన్న దృశ్యం


ప్రజాపాలన సభలో దరఖాస్తులు స్వీకరిస్తున్న డిసిసిబి వైస్ చైర్మన్

# ప్రజా పాలనను సద్వినియోగం చేసుకోవాలి

**నంగునూర్/దుబ్బాక, జనవరి 2, ప్రభాతవార్త :**

ప్రభుత్వ సంక్షేమ పథకాలను పేదలు సద్వినియోగం చేసుకోవాలని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు తప్పట శంకర్ అన్నారు. నంగునూర్ మండలం బద్దిపడగ గ్రామంలో మంగళవారం నిర్వహిచిన ప్రజాపాలన అభయహస్తం 6గ్యారెంటీల దరఖాస్తుల స్వీకరణలో ఆయన పాల్గొని మాట్లాడారు. కార్యక్రమంలో గ్రామ అధ్యక్షుడు దబ్బెట మహేష్, అవుల నాగరాజు, జితేందర్, వడ్లూరి నరేష్, అనంతరం శ్రీను తదితరులు పాల్గొన్నారు.

**భూంపల్లి-అక్బర్‌పేట మండలంలో...**

అక్బర్‌పేట-భూంపల్లి మండల పరిధిలోని అక బర్‌పేట, చిట్టాపూర్, చౌదర్‌పల్లి గ్రామాలలో మంగళవారం అధికా రులు ప్రజా పాలన కార్యక్రమం నిర్వహించి ప్రజల నుంచి దరఖాసులను స్వీకరించారు. ప్రజా పాలన కార్యక్రమాన్ని అర్హులైన ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో అధికారులు, ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్‌పార్టీ నాయకులు రాజిరెడ్డి, జయంత్, బిక్షపతి, శ్యామల, అబ్బుల ఉమారాణి, బాలగౌడ్, పోతనక రాజు, ధర్మారం స్వరూప బుచ్చయ్య, కమ్మరి కుమార్, పాతూరి వెంకటస్వామిగౌడ్, గజభీంకర్ అశోక్, సుమలత, రమేష్,సురేందర్‌రెడ్డి, చందు, స్వామిగౌడ్, పున్నవ్వ, బాబు, వంశీధర్ రెడ్డి, బాలరాజు, లక్ష్మణ్, నర్సింలు,విజయ, శోభారాణి పాల్గొన్నారు.

**కొండపాకలో...**

**కొండపాక, జనవరి 2, ప్రభాతవార్త :**

ప్రభుత్వం నిర్వహిస్తున్న ప్రజా పాలన కార్యక్రమాన్ని ప్రజలందరూ సద్వినియోగం చేసుకోవాలని రాష్ట్ర ఎంపిటిసిల ఫోరం వర్కింగ్‌ప్రెసిడెంట్ దేవి రవీందర్ అన్నారు. కుకునూర్‌పల్లి మండల లకుడారం, తిమ్మారెడ్డిపల్లి గ్రామాలలో మంగళవారం తహసీల్దార్ మలి ్లకార్జున్‌రెడ్డి,ఎంపిడిఓ రామిరెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించి ప్రజలనుంచి దరఖాస్తు లను స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన పాల్గొని మాట్లాడారు. ప్రజా సమస్యలను ప్రజా పాలనలో దరఖా స్తుల ద్వారా తెలియజేసి సమస్యలు పరిష్కరించుకోవాల న్నారు. ఎంపిడిఓ, ప్రత్యే అధికారి తదితరులు మాట్లా డుతూ ప్రజా పాలన ఈనెల 6 వరకు నిర్వహించడం జరుగుతుందని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో అధికారులు, ప్రజాప్రతినిధులు నాగేందర్, అమీనాబేగం, కందూరి కనకవ్వ, మల్లమారి రవీందర్, ఎలు ్ల శ్రీనివాస్‌రెడ్డి, బచ్చలి అండాలమ్మ, నాయకులు నాగపురి మురళి, కానుగుల బాలేష్, మేరుగోజు కర్ణాకర్, మంజే స్వామి, ఎండి అఫ్రాప్, బచ్చలి రవీందర్, చింత చందు తదితరులు పాల్గొన్నారు.

**పందిల్లలో...**

**హుస్నాబాద్, జనవరి 2, ప్రభాతవార్త :**

ప్రభుత్వ సంక్షేమ పథకాలను లబ్దిదారులు సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దార్ రవీందర్‌రెడ్డి అన్నారు. మంగళవారం ప్రజాపాలనలో భాగంగా పందిల్లగ్రామంలో దరఖాస్తు సెంటర్‌ను సర్పంచ్ తోడేటి రమేష్‌తో కలసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రజలకు దరఖాస్తు పూర్తిచేసే విధానంతోపాటు సందేహాలను నివృతి చేశారు. ఈ సందర్భంగా నిర్వహించిన ప్రజాపాలనకు గ్రామంలో 473 దరఖాస్తులు వచ్చినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సింగిల్ విండో చైర్మెన్ బొలిశెట్టి శివయ్య,ఎంపివో సత్యనారాయణతో పాటు తదితరులు పాల్గొన్నారు.

**హుస్నాబాద్‌లో...**

హుస్నాబాద్‌లోని 17వవార్డులో ప్రజాపాలన దరఖాస్తులను కౌన్సిలర్ వల్లపు రాజు ఆధ్వర్యంలో స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దరఖాస్తుల స్వీకరణకు ఈనెల 6వ తేదీ వరకు అవకాశం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో మంగళవారం 250 దరఖాస్తులు వచ్చినట్లు చెప్పారు. కార్యక్రమంలో స్పెషల్ ఆఫీసర్ భవాని, కాంగ్రెస్‌నాయకులు పెరుమండ్ల నర్సాగౌడ్, వార్డు ఇంచార్జీ అందె అజయ్‌తో పాటు తదితరులు పాల్గొన్నారు.

**అక్కన్నపేటలో...**

ప్రజాపాలన కార్యక్రమానికి అక్కన్నపేట మండలంలో భారీ స్పందన వస్తోందని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు జంగపల్లి ఐలయ్య అన్నారు. మంగళవారం మండలంలోని గుడాటిపల్లి, కట్కూర్, దుబ్బతండ, చాపగాని తండా గ్రామలలో నిర్వహిస్తున్న ప్రజా పాలన కార్యక్రమాన్ని పరిశీలించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధిగా సింగిల్‌విండో చైర్మెన్ బొలిశెట్టి శివయ్య హాజరయ్యారు. కాంగ్రెస్ గ్యారంటీలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని, ఇచ్చిన మాట మేరకు ప్రతీ హామీని అమలు చేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో సింగిల్‌విండో డైరెక్టర్ కుమార్, అక్కన్నపేట సర్పంచ్ ముత్యాల సంజీవరెడ్డి, గుడాటిపల్లి సర్పంచ్ బద్దం రాజిరెడ్డి, పార్టీ నాయకులు త్రిమూర్తి, రమేష్‌నాయక్, తిరుపతినాయక్, బాల్‌రాజె, సారయ్య, రవిందర్ తదితరులు పాల్గొన్నారు.

**రాయపోల్ మండలంలో...**

**రాయపోల్, జనవరి 2 ప్రభాతవార్త :**

ఆరు గ్యారంటీల అమలులో భాగంగా రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన ప్రజా పాలన కార్యక్రమం మంగళవారం రాయపోల్ మండల వ్యాప్తంగా ముమ్మరంగా కొనసాగింది. గ్రామ పంచాయతీల వద్ద ఏర్పాటు చేసిన కౌంటర్ల వద్దకు ప్రజలు భారీగా తరలివచ్చి దరఖాస్తులను అధికారులకు అందజేసారు. ఈ కార్యక్రమాన్ని తహసీల్దార్ దివ్య, ఎంపీడీవో మున్నయ్య, ఎపిఎం దుర్గాప్రసాద్ పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ కల్లూరి అనితశ్రీనివాస్, కొత్తపల్లి సర్పంచ్ మన్నె రంగమ్మ,బ్లాక్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు గొల్లపల్లి కనకయ్య, కాంగ్రెస్ మండల అధ్యక్షులు తప్పెట సుదాకర్,కాంగ్రెస్ మండల అధికార ప్రతినిధి కృష్ణాగౌడ్, లక్ష్మారెడ్డి, కరుణాకర్, బిఆర్ఎస్ నాయకులు ఉప్పరి స్వామి, అక్బర్, బిజెపి నాయకులు ఉప్పరి రాజు తదితరులు పాల్గొన్నారు.

**ఫసల్వాది గ్రామంలో...**

**సంగారెడ్డి మున్సిపాలిటి, జనవరి 1, ప్రభాతవార్త:** మండలంలోని ఫసల్వాది గ్రామంలో మంగళవారం నిర్వహించిన ప్రజాపాలన గ్రామసభలో ప్రజలు అందచేసిన దరఖాస్తులను డిసిసిబి వైస్ చైర్మన్ పట్నం మాణిక్యం స్వీకరించారు. ఈ సందర్భంగా పట్నం మాణిక్యం మాట్లాడుతూ అర్హులైన ప్రజలు 5 గ్యారంటీల కొరకు ధరఖాస్తు చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఎంపిడిఓ రవీందర్, ఎంపిటిసి సభ్యులు శారద, వార్డు సభ్యులు, అధికారులు, నాయకులు పాల్గొన్నారు.


అక్బర్‌పేట-భూంపల్లి మండలంలో దరఖాస్తులను స్వీకరిస్తున్న అధికారులు

**బిడెకన్నెలో...**

**ఝరాసంగం, జనవరి 2, ప్రభాతవార్త:**

మండలంలోని బిడెకన్నె గ్రామంలో మంగళవారం ప్రజాపాలన గ్రామసభను నిర్వహించారు. ప్రజలు అందచేసిన దరఖాస్తులను అధికారులు స్వీకరించి రశీదులను అందచేశారు. కార్యక్రమంలో తహసీల్దార్ సంజీవరావు, ఎంపిపి అధ్యక్షులు దేవదాస్, సర్పంచ్ నాగమ్మ, ఉప సర్పంచ్, ఆర్ఐ రామారావు తదితరులు పాల్గొన్నారు.

**మల్చల్మలో...**

**జహీరాబాద్, జనవరి 2, ప్రభాతవార్త:**

మండలంలోని మల్చెల్మ గ్రామంలో మంగళవారం ప్రజా పాలన గ్రామ సభను నిర్వహించారు. గ్రామస్థులు 6 పథకాల కోసం అందచేసిన దరఖాస్తులను అధికారులు స్వీకరించి రశీదులు అందచేశారు. కార్యక్రమంలో ఎంపిఓ మహేష్, కాంగ్రెస్‌పార్టీ మండల అధ్యక్షుడు పి నర్సింహారెడ్డి, సర్పంచ్ పాండురంగారెడ్డి, నాయకులు అక్బర్


మర్కుక్‌లో భజనలు చేస్తూ అక్షింతలను పంపిణీ చేస్తున్న దృశ్యం

## ప్రతి కుటుంబానికి అయోధ్య రాముని అక్షింతలు

**మర్కుక్, జనవరి 2 (ప్రభాతవార్త):** మండల పరిధిలోని ప్రతి కుటుంబానికి అయోధ్య రాముని అక్షింతలు అందించేందుకు కృషి చేస్తామని బిజెపి మండల పార్టీ అధ్యక్షుడు రమేష్ తెలిపారు. మంగళవారం మండలకేంద్రం మర్కుక్‌లో భజనలు చేస్తూ ప్రతి కుటుంబానికి అయోధ్య రాముని అక్షింతలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి హిందువు అయోధ్య రాముని ఆశీస్సుల కోసం ఈనెల 22న ప్రతిష్ట కార్యక్రమాన్ని నేరుగా లేదా సమాచార మాధ్యమాలలో వీక్షించి శ్రీరాముని కృపకు పాత్రులు కాగలరని పేర్కొన్నారు. మండలంలోని అన్ని గ్రామాల్లో ప్రతి కుటుంబానికి ఆయోధ్య రాముని అక్షింతలు అందేవిధంగా కృషి చేస్తామన్నారు.

## ప్రజా పాలనతో అర్హులకు పథకాలు

**చిన్నశంకరంపేట, జనవరి 2,ప్రభాతవార్త:** ప్రజా పాలనలతో అర్హులకు సంక్షేమ పథకాలు అందుతాయని ఎంపీడీవో ప్రవీణ్ తెలిపారు. మంగళవారం ప్రజాపాలనలో భాగంగా దరఖాస్తులను మడూర్,గజగట్లపల్లి,సంగాయపల్లి, గవ్వలపల్లి గ్రామాలలో స్వీకరించారు. ప్రభుత్వ పథకాలకు 1015, ఇతర సమస్యలపై 373 మంది అర్జి చేసుకున్నట్లు ఆయన తెలిపారు. ప్రజా పాలన ద్వారా గ్రామస్థుల, సమస్యలను ప్రభుత్వ పథకాలను అర్హులైన లబ్దిదారులకు అందించవచ్చన్నారు. వ్యవసాయాధికారి లక్ష్మీ ప్రవిణ్,సర్పంచి మీనా,ఎపీఎమ్ లక్ష్మీనారాయణ, ఎంపీవో గిరిధర్‌రెడ్డి, తదితరులు ఉన్నారు.


మాట్లాడుతున్న ఎంపీడీవో ప్రవీణ్

## చాల్కి పాఠశాలకు అశోక్ విరాళం

**న్యాల్‌కల్, జనవరి 2, ప్రభాతవార్త:** మండలంలోని చాల్కి గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల అభివృద్ధి (విద్యార్థుల అవసరాల కోసం)కి గ్రామంలోని సాయిబాబా ఫర్టిలైజర్ నిర్వాహకులు అశోక్ మంగళవారం విరాళం అందచేశారు. పాఠశాలలో పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు ఆకుల మీనా కుమారికి 11వేల రూపాయల చెక్కును అశోక్ అందచేశారు. పాఠశాలలో విద్యా ప్రమాణాల మెరుగుకు తన వంతు సహకారం ఎప్పుడు ఉంటుందని అశోక్ ప్రధానోపాధ్యాయురాలు మీనా కుమారికి అశోక్ భరోసా కల్పించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు సాయిలు, విశాల, ఫయాజొద్దిన్, మణికుమార్ తదితరులు ఉన్నారు.

## మెగా డిఎస్సీ ప్రకటన పట్ల హర్షం

**హుస్నాబాద్, జనవరి 2, ప్రభాతవార్త :** రాష్ట్రంలో మెగా డిఎస్సీ నిర్వహిస్తామని ప్రభుత్వం తీసుకుంటున్న నిర్ణయంపై తెలంగాణ ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డికి హర్షం వ్యక్తం చేసున్తన్నట్లు తెలంగాణ ప్రాంతానికి చెందిన బిసిసంక్షేమశాఖ జాతీయకార్యదర్శి గొర్ల అయిలేష్‌యాదవ్ అన్నారు. అలాగే గత ప్రభుత్వం అనుమతి ఇచ్చిన ప్రైవేట్ యూనివర్సిటీల్లోనూ బిసిలకు రిజర్వేషన్ సౌకర్యాన్ని కల్పించేలా ప్రభుత్వం ఆదేశాలివ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో, సింగిల్‌విండో చైర్మన్ బొలిశెట్టి శివయ్య,టిపిసిసి అధికార ప్రతినిధి కేడం లింగమూర్తి,యాదవచైతన్యవేదిక రాష్ట్ర వర్కింగ్ అధ్యక్షులు మేకల అశోక్‌యాదవ్, మదద గ్రామ సర్పంచ్, రెగ్జిన్‌రాజు, కాంగ్రెస్ నేత రజిత, శ్రీకాంత్‌గౌడ్, పచ్చిమట్ల శ్రీనివాస్,ఊసకోయిల ప్రకాశ్,కుర్రం మల్లయ్యయాదవ్, జంగం యాదయ్యయాదవ్,కొలిపాక అశోక్ ఉన్నారు.

## హామీలు ఖచ్చితంగా అమలు చేయాలి

**హుస్నాబాద్, జనవరి 2,ప్రభాతవార్త :** కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీలు కచ్చితంగా అమలు చేయాలని బిఆర్ఎస్ పార్టీ నాయకులు అయిలేని మల్లిఖార్జునరెడ్డి అన్నారు. మంగళవారం రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాలమేరకు నిర్వహిస్తున్న ప్రజాపాలన కార్యక్రమాలు మండలంలోని కూచనపల్లి,పందిల్ల,పొట్లపల్లి గ్రామాలను సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రభుత్వ స్వీకరిస్తున్న దరఖాస్తులు కాలయాపన చేయకుండా వెంటనే పరిశీలించి అర్హులకు అందేలా అమలు చేయాలన్నారు.

## ఆర్థిక సహాయం అందజేత

**చిన్నశంకరంపేట, జనవరి 2, ప్రభాతవార్త:**

మండల పరిధి సూరారం గ్రామానికి చెందిన పోచయ్య మంగళవారం అనారోగ్య సమస్యతో బాధపడుతూ మృతి చెందగా ఈ విషయం తెలుసుకున్న మైనంపల్లి స్వచ్ఛంద సంస్థ చైర్మన్, మెదక్ ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్‌రావు బాధిత కుటుంబానికి 5వేల ఆర్థిక సహాయం పంపగా సర్పంచి మల్కని నీరజా వారికి అందించారు. ఈ కార్యక్రమంలో పవన్ గౌడ్, రామస్వామి, అక్బర్, రాజు, శేఖర్‌లు పాల్గొన్నారు.


ప్రజ్ఞాపూర్‌లో అక్షింతలతో ఊరేగింపు నిర్వహిస్తున్న దృశ్యం

## గడప గడపకు అయోధ్య శ్రీరామ అక్షింతల వితరణ

**గజ్వేల్, జనవరి 2 (ప్రభాతవార్త):** అయోధ్య శ్రీరామ జన్మభూమి తీర్థక్షేత్ర ట్రస్టు ఆధ్వర్యంలో గడప గడపకు అయోధ్య శ్రీరామ అక్షింతలను అందజేసే కార్యక్రమంలో భాగంగా మంగళవారం ప్రజ్ఞాపూర్‌కు అక్షింతలు వచ్చాయి. ప్రజ్ఞాపూర్‌లోని పార్థివేశ్వరాలయం నుండి అక్షింతలను రామాలయం వరకు భక్తుల భజనలు, కోలాటం, భాజాభజంత్రీల మధ్య ఊరేగింపుగా తీసుకువచ్చారు. ఈ సందర్భంగా చేతిరెడ్డి లింగారెడ్డి, కుర్రె సాయిరెడ్డి మాట్లాడుతూ అయోధ్య రామ మందిరం నుండి తీసుకువచ్చిన అక్షింతలను గ్రామంలోని ప్రతి ఇంటికి అందజేయడం జరుగుతుందని తెలిపారు. అక్షింతలతో పాటు రాములవారి ఫోటో,కరపత్రం ఇవ్వనున్నట్లు తెలిపారు. ఇంటింటికి అందజేసే మృగ ముద్ర అక్షింతల్లో మనం ఎన్ని అక్షింతలైనా కలుపుకొని మన ఇంట్లో వాడుకోవచ్చని తెలిపారు. అలాగే ఈనెల 22వ తేదీన సాయంత్రం ప్రతి ఇంట్లో, ఇంటి ముందు 5 లేదా ఎక్కువ దీపాలు వెలిగించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో బండారు ఫనీందర్‌రావు, బండారు రాంమోహన్‌రావు, డాక్టర్ మెరుగు శ్రీనివాస్, వడ్డేపల్లి ప్రసాద్, రొట్టెల శ్రీనివాస్, గంగిశెట్టి భాస్కర్, సూరం ఆంజనేయులు, గోపిశెట్టి అశోక్‌కుమార్, గోపిశెట్టి రవి, మంగలిపల్లి సత్యనారాయణ, ప్రొద్దుటూరి నరేందర్, ప్రొద్దుటూరి శ్రీనివాస్, కుర్రె మహేందర్, లయన్స్ క్లబ్ రీజియన్ చైర్మన్ రాధాకృష్ణ, మర్రి స్వామి, కదుళ్ళ దేవేందర్, ఎల్లేశం, చంద సందీప్,అరవిందచారి, నర్సింహ చారి,సూర ఆంజనేయులు, మహిళలు శ్రీలత, రాజేశ్వరి, స్వప్న, సౌజన్య, సరిత, ఉమారాణి, భారతి, రాజేశ్వరి,చండిక, పద్మ, చంద్రకళ పాల్గొన్నారు.

**PUBLIC NOTICE**

The General Public are hereby informed that **Smt. Jyoti Kankaria W/o Sri. Hemendra Kumar Kankaria,** resident of Plot Nos.285 & 286, Panchasheel Enclave, Old Alwal, Secunderabad-500055, is Pattadar and Possessors of Non-Agriculture Land in Sy.Nos.1/A/2, 4/A, 4/E, 6/A/2, 6/A/6, 10/A, 10/A/2, 10/E, 10/U, 11/A, 11/A/1, 11/A/2 & 11/E (bearing Passbook No. T08070140319), situated at Muppireddypally Village, Toopran Mandal, Medak District, acquired through an Unregistered WILL dated 15.05.2018 executed by Sri. Hemendra Kumar Kankaria S/o Phulchand Kankaria and he expired on 19.08.2018, and the property is mutated in the name of Smt. Jyoti Kankaria in Revenue Records.

Smt. Jyoti Kankaria W/o Sri. Hemendra Kumar Kankaria has approached M/s. Indian Overseas Bank for availing certain Credit Facilities. If any person has any right, title or interest over the above property, they may contact the undersigned with all relevant documents and objections in writing with (7) days from the date of the Publication. In case, if no objections are received the bank will proceed with the sanction of the Credit Facilities, and objections if any thereof shall not be considered.

**Sd/- DEVAKAR. P**
**Advocate**
Plot No.180/P, Trimurthy Colony, Road No.4, Mahendra Hills, Secunderabad-26
**Phone No.040-35771731**
**Cell: 98490 25380**

# గెలుపోటములు మనకు కొత్త కావు

### మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీష్‌రావు

**దుబ్బాక, జనవరి 2, ప్రభాతవార్త :**

దుబ్బాక ఉప ఎన్నికల్లో ఓటమి తర్వాత చాలా బాదేసింది కానీ ఇటీవల జరిగిన శాసనసభ సాధా రణ ఎన్నికల్లో అసలు, వడ్డీకలిపి భారీమెజార్టీతో కొత్త ప్రభాకర్‌రెడ్డిని గెలిపించి దుబ్బాక సత్తా చాటారని మాజీమంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీష్‌రావు అన్నారు. దుబ్బాకలోని కోమటిరెడ్డి రజనీకాంత్ రెడ్డి ఫంక్షన్‌హాల్‌లో మంగళవారం నిర్వ హించిన దుబ్బాక కృతజ్ఞత సమావేశంలో అయన పాల్గొని మాట్లాడారు. మోసపూరిత వాగ్దానాలకు దుబ్బాకలో 54 వేల మెజార్టీని అందించి బుద్ది చెప్పారన్నారు. తెలంగాణ ఉద్యమానికి పురిటిగడ్డ అని ఉద్యమంలో కేసులుఅయినా అరెస్టు అయినా, ధర్నాలు, రాస్తారోకోలు పోరాటాలకు సెప్టంబర్ 17న జెండా ఎగురవేయడం జరిగినా మొదట దుబ్బాకలో జరిగేవన్నారు. దుబ్బాక విజయం ముమ్మాటికీ కార్యకర్తలకే దక్కుతుందన్నారు. కత్తిపోటు సంఘటన మూలంగా ప్రభాకర్‌రెడ్డి తీవ్రంగా మనస్తాపానికి గురయ్యారని పేర్కొన్నారు. చీమకు అయినా హాని చేయని అజాతశత్రువుగా ఉన్న ప్రభాకర్‌రెడ్డికి హాని కలగడం నిజంగా బాధాకరమనేని తెలిపారు. దుబ్బాకలో ఘన విజయం సాధించి నప్పటికీ రాష్ట్రంలో అధికారంలోకి రాకపోవడం బాధకు గురికావడం జరిగిందన్నారు. ఏమైనా పొరపాట్లు చేసుకుంటే సర్దుకొని ముందుకు సాగాలన్నారు.బిఆర్ఎస్ పూల, ముళ్ల బాటలు చూసిందన్నారు. తెలంగాణ కోసం కొట్లాడే బిఆర్ఎస్ పార్టీకి ఎంపి ఎన్నికల్లో ఘన విజయం అందించాలన్నారు. మొదటి నుంచి కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం తెలంగాణపై శీత కన్ను వేస్తుందన్నారు.

బిజెపి, కాంగ్రెస్‌లకు ఓట్లు సీట్లు కావాలి తప్ప అభివృద్ధి అవసరం లేదన్నారు. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల్లో ఇచ్చిన హామీలను ఎప్పుడు అమలు చేస్తుందో వేచి చూద్దామన్నారు. దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి తదితరులు మాట్లాడారు. సమావేశంలో ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు వేలేటీ రోజారాధాకృష్ణశర్మ, ఎమ్మెల్సీ డా॥ యాదవరెడ్డి, ఒంటేరు ప్రతాప్‌రెడ్డి, చిట్టి దేవేందర్‌రెడ్డి, లక్కిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, గన్నె వనితభూంరెడ్డి, కొత్త పుష్పలత కిషన్‌రెడ్డి, కడతల రవీందర్‌రెడ్డి, పార్టీ శ్రేణులు తదితరులు పాల్గొన్నారు.



సిఎం రేవంత్‌రెడ్డికి శ్రీకొమురవెల్లి మల్లికార్జునస్వామి చిత్రపటాన్ని అందిస్తున్న దృశ్యం

## సిఎం రేవంత్‌రెడ్డిని కలిసిన శ్రీ కొమురవెల్లి మల్లికార్జునస్వామి దేవాలయం అర్చకులు

**కొమురవెల్లి, జనవరి 2, ప్రభాతవార్త:** శ్రీకొమురవెల్లి మల్లికార్జున స్వామి దేవాలయం ప్రధానఅర్చకుడు మహాదేవుని మల్లికార్జున్ ఆధ్వర్యంలో అర్చక బృందం మంగళవారం హైదారాబాద్‌లో సిఎం ఎనుముల రేవంత్‌రెడ్డిని కలిసి స్వామివారి చిత్రపటాన్ని,తీర్థ ప్రసాదాలను అందించారు. కొమురవెల్లి ప్రత్యేకత ప్రశస్త్యాన్ని సిఎం రేవంత్‌రెడ్డికి ప్రధాన అర్చకులు మహాదేవుని మల్లికార్జున్,అర్చక బృందం సూర్యకుమార్, సిద్దేశ్వర్, వీరేశలింగంలు వివరించారు. అలయ అభివృద్ధి కోసం అర్చక బృందానికి సిఎం రేవంత్‌రెడ్డి హామీ ఇచ్చినట్లు అర్చక బృందం సభ్యులు తెలిపారు.

## జిల్లా కలెక్టర్‌ను కలిసిన మున్సిపల్ కమిషనర్



జిల్లా కలెక్టర్ రాజర్షి షాకు పుష్పగుచ్చాన్ని అందజేస్తున్న నర్సాపూర్ మున్సిపల్ కమిషనర్ వెంకట్‌గోపాల్

**నర్సాపూర్, జనవరి 2, ప్రభాతవార్త:** నూతన సంవత్సరం 2024 పురస్కరించుకొని మంగళవారం మెదక్ జిల్లా కలెక్టర్ కార్యాలయలంలో నర్సాపూర్ మున్సిపల్ ఆర్.వెంకట్ గోపాల్‌తోపాటు ఇతర మున్సిపాలిటీల కమిషనర్‌లు జిల్లా కలెక్టర్ రాజర్షి షాను అదేవిదంగా జిల్లా అదనపు కలెక్టర్ రమేశ్ లను మార్యద పూర్వకంగా కలిశారు. ఈ మేరకు నూతన సంవత్సరం 2024 సందర్భంగా జిల్లా కలెక్టర్ రాజర్షి షాను అదేవిదంగా జిల్లా అదనపు కలెక్టర్ రమేశ్ లకు పుష్పగుచ్చాన్ని అందజేసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేశారు. ఈకార్యక్రమంలో నర్సాపూర్ మున్సిపల్ కమిషనర్ వెంకట్‌గోపాల్ తో పాటు మెదక్ జిల్లాలోని వివిద మున్సిపల్ కమిషనర్‌లు, సిబ్బంది పాల్గొన్నారు.

## మండలంలో సామాజిక తనఖీలు

**హవేలీఘనపూర్, జనవరి 2,ప్రభాతవార్త:** మండలంలోని ఎంపీడీవో కార్యాలయంలో డీఆర్‌డిఏ అడిషనల్ పిడి విరోజ ఆధ్వర్యంలో గ్రామాల రికార్డుల పరిశీలిన, సామాజిక తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఎన్ఆర్ఈజీఎస్ పనుల గురించి గ్రామాలలో ఎలాంటి అవక తవకలు జరగలేదని స్పష్టం చేశారు. రెండో విడుతలో భాగంగా మండలానికి 61161717 రుపాయల పనులు చేశారని, పనుల గురించి గ్రామాల వారీగా తనిఖీలు చేశామని అందులో భాగంగా నాలుగు కోట్ల76లక్షల 17,836 రుపాయలు కూలీలుగా పని చేశారని, గ్రామాలలో మెటిరీయల్ పంచడానికి 1కోటి35లక్షల43వేల581 రుపాయలు ఖర్చు పెట్టినట్లు తెలిపారు. సోషల్ ఆడిట్లో భాగంగా ప్రతి గ్రామంలో రైతులు,ప్రజలకు రోజుకు 275 రుపాయలు కూలి ఇచ్చామని అన్నారు. వంద రోజులు కూలి పనులు, పని దినాలను ప్రజలు ప్రతి ఒక్కరు వాడుకున్నారని దాని వల్ల ప్రజలకు సహాయం జరిగిందన్నారు. కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలతో నడిచే పథకంలో రైతుల చేపలచెరువులు,పండ్ల తోటలు,నర్సరీలు, కోళ్లపెంపకం, గేదెల పెంపకం, వాటి సంరక్షణకు షెడ్లు ఇవ్వడం జరుగుతుందన్నారు. డ్రాగన్ ఫ్రూట్ తోటలు నేటికి మంచి మార్కెట్ ఉందని, రైతులు కొంచెం కష్టపడితే డ్రాగన్ ఫ్రూట్ తోటలు కూడ లాభసాటిగా ఉన్నాయని ఆమె తెలిపారు. తనిఖీల వల్ల అవినీతి జరుగకుండా గ్రామంలో పథకం పక్కా ప్రణాళికతో పథకం అమలవుతుందన్నారు. కార్యక్రమానికి సహకరించి ప్రతి ఒక్కరికి ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో డివివో శ్రీహరి, హెచ్ఆర్ మేనేజర్ రాజేందర్ రెడ్డి, ఎంపీడీవో శ్రీరామ్, ఏపివో రాజ్ కుమార్, టీఏలు, ఎఫ్ఏలు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

## మధ్యాహ్న భోజన బిల్లులు వెంటనే చెల్లించాలి

### ఎస్టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి పోచయ్య

**చిన్నశంకరంపేట, జనవరి 2,ప్రభాతవార్త:** ప్రభుత్వ పాఠశాలలో మధ్యాహ్న భోజన బిల్లులను ప్రభుత్వం వెంటనే చెల్లించాలని ఎస్టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి పోచయ్య డిమాండ్ చేశారు. మంగళవారం చిన్న శంకరంపేటలో వారు మాట్లాడుతూ గత 5 నెలలుగా మధ్యాహ్న భోజన బిల్లులు రాక నిర్వాహకులు నానా తంటాలు పడుతున్నారని, భోజనానికి అప్పు చేసి మరి రుచికరమైన భోజనాన్ని పిల్లలకు అందిస్తున్నప్పటికి ప్రభుత్వం మాత్రం బిల్లులు చెల్లించకపోవడం బాధాకరమన్నారు. పాఠశాలలో స్కావెంజర్లు లేకపోవడంతో మూత్రశాలలు అపరిశుభ్రంగా మారాయని, విద్యార్థులు రోగాలబారిన పడే అవకాశం ఉందని, ప్రభుత్వం చొరవ తీసుకొని సమస్యలను పరిష్కారించాలని ఆయన కోరారు. కార్యక్రమంలో ఎస్టీయూ మండలాధ్యక్షుడు గోపాల్, ప్రధాన కార్యదర్శి జహిరొద్దిన్, జిల్లా నాయకులు శివప్రసాద్, సత్యనారాయణ పాల్గొన్నారు.

## నేటి నుంచి వికసిత్ భారత్ సమావేశాలు



మాట్లాడుతున్న బీజేపీ మండల అధ్యక్షులు కోణం విఠల్

**పెద్దశంకరంపేట, జనవరి 2 ప్రభాతవార్త:** జనవరి 3వ తేదీ నుండి 16వ తేదీ వరకు పెద్దశంకరంపేట మండలంలో వికసిత్ భారత్ సమావేశాలు నిర్వహించనున్నట్లు బీజేపీ అధ్యక్షులు మండల కోణం విఠల్ పేర్కొన్నారు. మంగళవారం పెద్దశంకరంపేటలోని బిజెపి కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి పథకాలు గ్రామీణస్థాయిలో ప్రజలకు ఎంతవరకు చేరుకున్నాయో తెలుసుకోవడం జరుగుతుందన్నారు.

మిగిలిన కేంద్ర ప్రభుత్వ పథకాలను ప్రజలకు వివరించడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఆయా ప్రభుత్వ శాఖల అధికారులు కూడా పాల్గొంటారని వివరించారు. ఈ కార్యక్రమాలకు నోడల్ అధికారులు ఎస్‌బీఐ, యూనియన్, ఏపీజీవీబీ బ్యాంకుల మేనేజర్లు ప్రదీప్‌కుమార్, కృష్ణ, రచనకుమారి వ్యవహరిస్తున్నా రన్నారు. ఈ కార్యక్రమంలో మండల బీజేపీ నాయకులు మండల శ్రావణ్ కుమార్, బుగుడాల కృష్ణ, మంగలి కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని కలిసిన ఆసిఫ్ అలీ

**ఆమనగల్లు జనవరి2,ప్రభాతవార్త :**

సచివాలయంలో మంగళవారం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని రేవంత్ మిత్రమండలి వ్యవస్థాపక రాష్ట్ర అధ్యక్షుడు ఆసిఫ్ అలీ మర్యాపూర్వకంగా కలిసి నూతన సంవత్సరం శుభాకాంక్షలు తెలిపా రు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..ప్రభుత్వ ప్రజాపాలనలో భాగంగా ప్రభుత్వ కార్యక్రమాలను ప్రజలోకి తీసుకెళ్లాలేని ప్రజాపా లనకు సంబంధించిన ఆరు గ్యారంటీల పథకాలను అర్హులైన వారికి అందేలా చూడాలని సూచించారని అన్నారు.ప్రజలు ఎలాంటి అపోహలు ఆందోళన పడకుండా చూడాలని అన్నారు.ఎన్నికల్లో కష్టపడ్డ ప్రతి కార్యకర్తకు న్యాయం చేస్తామని అన్నారన్నారు. రాబో యే పార్లమెంట్ ఎన్నికలో గెలిచి కేంద్రంలో అధికారంలోకి తీసుకొ చ్చి రాహుల్ గాంధీని ప్రధానమంత్రి చేయడమే లక్ష్యంగా కృషి చేయాలని కోరారని తెలిపారు.

# 'ప్రజాపాలన'లో ప్రతి దరఖాస్తును స్వీకరించాలి

### మెదక్ జిల్లా కలెక్టర్ రాజర్షి షా



దరఖాస్తులను స్వీకరిస్తున్న కలెక్టర్ రాజర్షి షా

**హవేలీఘనపూర్, జనవరి 2,ప్రభాతవార్త:** సంక్షేమ పథకాల ద్వారా అర్హులైన వారందరికి లబ్ధి చేకూర్చేందుకు వీలుగా ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న ప్రజాపాలన సభలలో ప్రజలు అందించే అన్ని రకాల దరఖాస్తులను స్వీకరించాలని జిల్లా కలెక్టర్ రాజర్షిషా అధికారులకు సూచించారు. మంగళవారం ఆయన మెదక్ అసెంబ్లీ నియోజక వర్గ పరిధిలోని హవేలీఘనపూర్ మండలం, బ్యాతోల్ గ్రామంలోని రైతు వేదికలో ఏర్పాటు చేసిన ప్రజాపాలన సభను క్షేత్ర స్థాయిలో పరిశీలించారు. ఈ నెల 6వ తేది వరకు ప్రజా పాలన కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందని, దరఖాస్తుదారులు ముందస్తుగానే దరఖాస్తును నింపి స్వీకరణ కౌంటర్లలో అందించాలని, దరఖాస్తు దారులు నిజమైన సమాచారాన్ని ఫారములలో పొందుపర్చాలన్నారు. తద్వారా అర్హత గల లబ్ధిదారులకు న్యాయం జరుగుతుందని తెలిపారు. మహాలక్ష్మీ, రైతు భరోసా, గృహజ్యోతి, ఇందిరమ్మ ఇండ్లు, చేయూత పథకాలకు సంబంధించి దరఖాస్తులనుస్వీకరించడం జరుగుతుందని తెలిపారు. ప్రజల సౌకర్యం కోసం ఎన్ని కౌంటర్లను ఏర్పాటు చేశారు. దరఖాస్తులను అందుబాటులో ఉంచారా, దరఖాస్తులను నింపేందుకు వాలంటీర్లు, సిబ్బంది, ప్రజలకు సహకారం అందిస్తున్నారా, తాగునీరు, కూర్చోనేందుకు కుర్చీలు, వంటి తగిన సదుపాయాలను ప్రజలకు అందుబాటులో ఉన్నాయా వంటి అంశాలను పరిశీలించారు. ఇప్పటి వరకు స్వీకరించిన దరఖాస్తులు ఎన్ని, ఎక్కువగా ప్రజలు ఏ పథకం కోసం దరఖాస్తు చేస్తున్నారనే వివరాల గురించి ఫిర్యాదులకు అస్కారం లేకుండా ప్రజా పాలన కార్యక్రమాన్ని జిల్లాలో సాఫిగా నిర్వహిస్తూ పూర్తి స్థాయిలో విజయవంతం చేయాలని సూచించారు. దరఖాస్తుదారునికి తప్పనిసరిగా రశీదును అందించాలని, అధికారులను జిల్లా కలెక్టర్ ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ప్రత్యేక అధికారి, జిల్లా మైన్స్ మరియు జియాలజీ శాఖ, సహాయ సంచాలకులు జయరాజ్, మండల ప్రత్యేక అధికారిణి విజయలక్ష్మీ, తహసీల్దార్ నారాయణ, సర్పంచి భూపాల్‌రెడ్డి, సబంధిత అధికారులు పాల్గొన్నారు.



గవ్వలపల్లిలో పెట్రోల్ బంకు వద్ద వాహన వినియోగదారులు

## సమ్మె ఎఫెక్ట్ - ఆందోళనలో వినియోగదారులు

**చిన్నశంకరంపేట,జనవరి 2,ప్రభాతవార్త:** కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన మోటారు వాహనాల చట్టాలను నిరసిస్తూ తెలంగాణ అయిల్ ట్యాంకర్ల యజమానులు సమ్మెకు దిగడంతో డిజిల్,పెట్రోల్ వాహనచోదకులు పెద్ద ఎత్తున పెట్రోల్ బంకులోకి చేరారు. సాయంత్రం సమ్మె విరమిస్తున్నామని, అయిల్ ట్యాంకర్ల యజమానుల ప్రకటించినప్పటికి అర్థరాత్రి అయినా పెట్రోల్ బంకులు వాహనాలతో కిటకిటలాడాయి. యాసంగి సీజన్ కావడంతో ట్రాక్టర్ల యజమానులు పెద్ద ఎత్తున డిజిల్ కోసం డబ్బాలతో పెట్రోల్ బంకులకు చేరుకున్నారు. పోలీస్ సిబ్బంది వచ్చి సర్ది చెప్పినప్పటికి పెట్రోల్,డీజిల్ కోసం ప్రజలు బారులు తీరి క్యూలైన్‌లో వేచి చూస్తున్నారు.

**హిట్ అండ్ రన్ కేసు....**

కేంద్ర ప్రభుత్వం ఇటీవల చట్టాలలో సవరణలు చేసింది. అందులో హిట్ అండ్ రన్ కేసు. గతంలో ట్రక్కులు,లారీలు,బస్సులు, కార్లు ఇలా ఏ వాహనం అయినా యాక్సిడెంట్ అయితే.... అది హిట్ అండ్ రన్ కేసు. అయితే పోలీస్ స్టేషన్‌లో బెయిల్ వస్తుండేది. అదే విధంగా శిక్షలు కూడ తక్కువగా ఉండేవి. చట్ట సవరణతో హిట్ అండ్ రన్ కేసు తీవ్రత పెరిగింది. 10లక్షల జరిమాన, పదేళ్ల జైలు శిక్ష విధించే అవకాశం ఉంది. ఈ చట్టం వల్ల ట్రక్కు,లారీ బస్సు డ్రైవర్లపై తీవ్ర ప్రభావం చూపిస్తుందని, తప్పు ఎవరిదైనా శిక్ష మాకే పడుతుంది అంటూ... ట్రక్కు, లారీ బస్సు డ్రైవర్లు ఆందోళన చేస్తున్నారు. దేశ వ్యాప్తంగా మూడు రోజులుగా ఈ నిరసనలు జరుగుతున్నా ఎవరూ పట్టించుకోలేదు. ఈ క్రమంలోనే నేటి నుండి అయిల్ ట్యాంకర్లు కూడ సమ్మెలోకి దిగుతామనే వార్తల క్రమంలో...పెట్రోల్,డిజిల్ కోసం పెట్రోల్ బంకుల దగ్గర ప్రజలు బారిగా బారులు తీరారు.

## శ్రీమరకత మల్లికార్జునస్వామి ఆలయంలో ఘనంగా నాగవెల్లి



నాగవెల్లి నిర్వహిస్తున్న ఒగ్గుపూజారులు, మల్లేష్‌యాదవ్ దంపతులు

**నర్సాపూర్, జనవరి 2, ప్రభాతవార్త:** యాదవ సంఘం ఆధ్వర్యంలో కొనసాగుతున్న శ్రీకేతకీ భ్రమరాంబిక సహిత మల్లికార్జునస్వామి ఆలయం వార్షికోత్సవ ఉత్సవాలు ఘనంగా నిర్వహిస్తున్నారు. ఈ ఉత్సవాల్లో భాగంగా మొదటి రోజు గంగపటం నిర్వహించగా రెండవ రోజు ఉత్సావాల నిర్వాహకులు మాచునూరి మల్లేష్‌యాదవ్ దంపతులు, శంకరయ్యయాదవ్ దంపతుల ఆధ్వర్యంలో పూజారి హరిప్రసాద్‌శర్మ రుద్రహోమం నిర్వహించారు. కాగా మూడోరోజు శ్రీమల్లికార్జునస్వామి కళ్యాణం, అగ్నిగుండాలు, బోనాల ఊరేగింపు మంగళహారతి నిర్వహించడం జరిగింది. కాగా మంగళవారం ఒగ్గు పూజారుల ఆధ్వర్యంలో శ్రీమల్లికార్జునస్వామికి నాగవెల్లి కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. యాదవసంఘం సభ్యులు నారాయణయాదవ్, రాములుయాదవ్, రామమ్మ శంకరయ్యయాదవ్, మల్లేష్‌యాదవ్ అధ్వర్యంలో ప్రతి రోజు అన్న దానం నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో నిర్వాహకులు మాచునూరి మల్లేష్‌యాదవ్, శంకరయ్యయాదవ్, రాజుయాదవ్, రమేశ్‌యాదవ్, మల్లేష్‌యాదవ్, లక్ష్మణ్‌యాదవ్, చంద్రయ్యయాదవ్, శ్రీశైలంయాదవ్, సురేశ్ యాదవ్, ఎద్దురమేశ్‌యాదవ్, దేవేందర్‌యాదవ్ పాల్గొన్నారు.

## ప్రజాపాలనను సద్వినియోగం చేసుకోవాలి

### జెడ్పీటీసీ రమేష్‌గౌడ్, సర్పంచి ప్రీతి మహేందర్‌రెడ్డి

**వెల్దుర్తి, జనవరి 2 ప్రభాతవార్త:** రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఆరు గ్యారెంటీ పథకాల అమలు కోసం ప్రజలు అభయ హస్తం దరఖాస్తులను పూర్తి వివరాలతో నింపి అధికారులకు అందజేయాలని జెడ్పీటీసీ రమేష్‌గౌడ్, సర్పంచి ప్రీతి మహేందర్‌రెడ్డిలు అన్నారు. మంగళవారం మండల పరిధిలోని కుకనూర్, దామరంచ, ధర్మారం గ్రామాల్లో ప్రజాపాలన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బడుగు, బలహీన వర్గాల కోసం ప్రవేశపెట్టిన ఆరు గ్యారెంటీలను అమలు చేయాలన్నారు. గ్రామ పంచాయితీల్లో ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటు చేసి ప్రజల నుండి అధికారులు దరఖాస్తులు స్వీకరిస్తున్న ఈ కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

**ప్రజాపాలనతోనే సమస్యల పరిష్కారం : ఆవుల రాజిరెడ్డి**

మండల పరిధిలోని కుకునూరు గ్రామంలో నిర్వహించిన ప్రజా పాలన కార్యక్రమంలో టీపీసీసీ కార్యదర్శి, నర్సాపూర్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి ఆవుల రాజిరెడ్డి, నాయకులు నరేందర్‌రెడ్డిలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా తెలంగాణ కాంగ్రెస్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఆరు గ్యారెంటీల అమలుకు ప్రజల నుండి విశేష స్పందన లభిస్తుందన్నారు. తప్పకుండా ప్రభుత్వం ఆరు గ్యారెంటీలను అమలు చేస్తుందన్నారు. దరఖాస్తు దారులతో మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ ఆరు గ్యారెంటీలను దరఖాస్తుల్లో పొందుపరచి అధికారులకు ఇచ్చి రసీదులు పొందాలన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు మల్లేష్, హనుమేశ తదితరులు పాల్గొన్నారు.



దరఖాస్తులను స్వీకరిస్తున్న రమేష్‌గౌడ్, ప్రీతి మహేందర్‌రెడ్డి



ప్రజాపాలన దరఖాస్తులను స్వీకరిస్తున్న ఆవుల రాజిరెడ్డి

## రాష్ట్ర సంపాదన ప్రజలకు అందించడానికే ప్రజాపాలన

### -టీపీసీసీ ప్రధాన కార్యదర్శి ఆవుల రాజిరెడ్డి

**కొల్చారం, జనవరి 2 ప్రభాతవార్త:** రాష్ట్ర సంపాదన ప్రజలకు అందించడానికే ప్రజాపాలన నిర్వహించడం జరుగుతుందని టీపీసీసీ ప్రధాన కార్యదర్శి, కాంగ్రెస్ పార్టీ నర్సాపూర్ నియోజకవర్గ ఇంచార్జి ఆవుల రాజిరెడ్డి, మండల అధ్యక్షులు నాగులగారి మల్లేశంగౌడ్ అన్నారు. మంగళవారం రంగంపేట గ్రామంలోని గ్రామ పంచాయతీ లో నిర్వహించిన ప్రజాపాలన కార్యక్రమాన్ని వారు సందర్శించి పరిశీలించారు. అలాగే దరఖాస్తుదారుల నుండి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అర్హులైన ప్రతి ఒక్కరూ ఆరు గ్యారెంటీల కోసం గ్రామాల్లో ఏర్పాటు చేసిన గ్రామసభల్లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ గఫార్ మియా, కాంగ్రెస్ నాయకులు గోవర్ధన్, దర్జి రాజు, దేవన్నగారి శేఖర్, శేఖర్‌రెడ్డి, రాంపూర్ సర్పంచి రాంరెడ్డి, మాజీ సర్పంచి ఆశన్నగారి శ్రీశైలం, గొండ కృష్ణ, రంగంపేట ప్రాథమిక ఆరోగ్య కేంద్రం డాక్టర్ హర్షిత, సూపరింటిండెంట్ సుదర్శన్, డిప్యూటీ తహశీల్దార్ నాగవర్ధన్, మండల విస్తరణ అధికారులు రోజా, నిరోశ, పంచాయితీ కార్యదర్శి ప్రియాంక, ఆయా శాఖల అధికారులు, కాంగ్రెస్ నాయకులు ఆగంగౌడ్, స్వామి, ప్రవీణ్‌రెడ్డి, గాండ్ల కృష్ణ, పాడెపు నాగరాజు, రమేష్, బండి మల్లేశం, నాగిరెడ్డి, బాల్‌రాజ్, వెంకట్‌గౌడ్ కోనాపూర్ సిద్ధిరాములు, అంగన్వాడీ టీచర్లు, ఆశావర్కర్లు, ఏఎన్ఎంలు తదితరులు ఉన్నారు.

## ఆరు గ్యారంటీలను వంద రోజుల్లో అమలు చేస్తాం

### కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు ఆంజనేయులుగౌడ్



దరకాస్తులు స్వీకరిస్తున్న ఆంజనేయులుగౌడ్ తదితరులు

**నర్సాపూర్, జనవరి 2, ప్రభాతవార్త:** అభయ హస్తం పథకంలో భాగంగా ఆరు గ్యారంటీల పథకాలను వంద రోజుల్లో అమలు చేస్తామని కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు ఆంజనేయులుగౌడ్ అన్నారు. మంగళవారం చిప్పల్‌తుర్తి, జక్కపల్లి గ్రామాల్లో నిర్వహించిన ప్రజాపాలన గ్రామసభలను ఆయన పరిశీలించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత వంద రోజుల్లో ఆరుగ్యారంటీ పథకాలను అమలు చేస్తామని ఇచ్చిన హామీలను అమలు చేసెందుకు శ్రీకారం చుట్టిందన్నారు. ఈకార్యక్రమంలో మండల తహశీల్దార్ కమలాద్రి, ఎంపిపి జ్యోతి సురేశ్‌నాయక్,మాజీ జడ్‌పిటీసీ శ్రీనివాస్‌గుప్త,మండల కాంగ్రెస్ అధ్యక్షులు మల్లేశం,నర్సాపూర్ మండల వర్కింగ్ ప్రసిడెంట్ ఉదయ్‌కుమార్, నాయకులు ,కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## అర్హులు దరఖాస్తులు చేసుకోవాలి



ప్రజా పాలన గ్రామ సభలో ధరఖాస్తులను పరిశీలిస్తున్న ఎంపిడిఓ శంకర్

**అల్లాదుర్గం, జనవరి 2, ప్రభాతవార్త:** గ్రామాల్లో నిర్వహించే ప్రజా పాలన గ్రామసభల్లో 5 గ్యారంటీ పథకాల్లో లబ్దిపొందేందుకు దరఖాస్తులు చేసుకోవాలని ఎంపిడిఓ శంకర్ పేర్కొన్నారు. మంగళవారం మండలంలోని గడి పెద్దాపూర్, రెడ్డిపల్లి, అప్పాజీపల్లి గ్రామాల్లో నిర్వహించిన ప్రజా పాలన గ్రామ సభలను పరిశీలించి ప్రజలు అందచేసిన ధరఖాస్తులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఎంపిడిఓ శంకర్ మాట్లాడుతూ ప్రజలు అందించే ధరఖాస్తుల స్వీకరణలో అధికారులు అలసత్వం వహించవద్దని హెచ్చరించారు. జనవరి 6వ తారీఖ వరు ప్రజలు తమ ధరఖాస్తులను అధికారులకు అందచేసే అవకాశం ఉందని గుర్తు చేశారు. గ్రామాల్లో నిర్వహిస్తున్న ప్రజా పాలన గ్రామ సభల్లో ధరఖాస్తులు అందించేందుకు వస్తున్న ప్రజలకు తగు సౌకర్యాలు (తాగునీరు, కుర్చీలు, కౌంటర్లు తదితర) ఏర్పాట్లు చేస్తున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ సతీస్, ఎంపిఓ, రెవిన్యూ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## కడా ప్రత్యేకాధికారిని కలిసిన కాంగ్రెస్ నాయకులు

**కొడంగల్,జనవరి 2ప్రభాతవార్త**

కొడంగల్ ఏరియా డెవలప్‌మెంట్ అథారిటి(కడా) ప్రత్యేకాధికా రి వెంకట్ రెడ్డిని స్థానిక కాంగ్రెస్ నాయకులు మర్యాద పూర్వ కంగా కలిశారు.కడా ప్రత్యే క అధికారిగా నియమితులైన డిప్యూ టీ కలెక్టర్ వెంకట్‌రెడ్డి మంగళవారం కొడంగల్‌కు రావడంతో మున్సిపల్ కౌన్సిలర్ శంకర్‌నాయక్, కాం గ్రెస్ మైనార్టీ సెల్ అద్యక్షులు అసీఫ్‌ఖాన్,శ్రీనునాయక్, శంకరయ్య, కిషన్ నాయక్,రాజునాయక్ తదితరులు ప్రత్యేకాధికారిని కలిశారు.



ప్రజాపాలనలో దరఖాస్తులను స్వీకరిస్తున్న ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి

## అర్హులందరూ దరఖాస్తు చేసుకోవాలి : ఎమ్మెల్యే

**అమీన్‌పూర్, జనవరి 2 ప్రభాతవార్త:** రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన ఆరు గ్యారెంటీల అమలులో భాగంగా నిర్వహిస్తున్న ప్రజాపాలన కార్యక్రమంలో నూతన సంక్షేమ పథకాల కోసం అర్హులందరూ దరఖాస్తు చేసుకోవాలని పటాన్‌చెరు శాసనసభ్యులు గూడెం మహిపాల్‌రెడ్డి విజ్ఞప్తి చేశారు. మంగళవారం అమీన్‌పూర్ మున్సిపల్ పరిధిలోని 10, 20వ వార్డుల్లో ఏర్పాటు చేసిన ప్రజాపాలన కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ తుమ్మల పాండు రంగారెడ్డితో కలసి ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన 6 గ్యారంటీల అమలులో భాగంగా వివిధ సంక్షేమ పథకాల కోసం ప్రజల నుండి దరఖాస్తులు స్వీకరించడం జరుగు తుందన్నా తెలిపారు. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ నరసింహాగౌడ్, కమిషనర్ జ్యోతిరెడ్డి, కౌన్సిలర్లు బోయిని బాలమణి బాలరాజు, అనిరుధ్‌రెడ్డి పాల్గొన్నారు.

## కంకోల్‌లో ప్రజా పాలన గ్రామ సభ



కంకోల్‌లో ప్రజాపాలన గ్రామసభలో ధరఖాస్తులు అందచేస్తున్న ప్రజలు

**మునిపల్లి, జనవరి 2, ప్రభాతవార్త:** మండలంలోని కంకోల్ గ్రామంలో మంగళవారం ప్రజా పాలన గ్రామ సభను నిర్వహించారు. గ్రామ సభలో ప్రజలు అందచేసిన అభయహస్తం గ్యారంటీల ధరఖాస్తులను అధికారులు స్వీకరించి రశీదులు అందచేశారు. గ్రామంలో నిర్వహించిన ప్రజా పాలన గ్రామ సభలో 294 ధరఖాస్తులు అందినట్లు అధికారులు పేర్కొన్నారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ గౌడిగామ విశ్వనాథ్‌పాటిల్, గౌడిగామ శైలజ శివశంకర్ పాటిల్, ఎంపిడిఓ డాక్టర్ యం హరినందనరావు, ఎంఈఓ దశరథ్, ఏఓ శివకుమార్, ఉప సర్పంచ్ వీరన్న, పంచాయితీ కార్యదర్శి సంతోష, అధికారులు, నాయకులు బాలయ్య, సంతోష్, మధుకరు, పి గణపతి రావు, సౌందర్య లక్ష్మి, సౌందర్య అనిత తదితరులు పాల్గొన్నారు.

**చౌటకూరు మండలంలో...**



వెడికోల్‌ల దరఖాస్తులు స్వీకరిస్తున్న తహసీల్దార్ ఈశ్వర్‌రాణి

**చౌటకూరు, జనవరి 2, ప్రభాతవార్త:** మండలంలోని వెండికోల్, లింగంపల్లి గ్రామాల్లో మంగళవారం ప్రజా పాలన గ్రామ సభను నిర్వహించారు. కార్యక్రమంలో భాగంగా ఆయా గ్రామాల్లో ప్రజలు అందచేసిన ధరఖాస్తులను స్వీకరించి అందుకు రశీధులు అధికారులు అందచేశారు. కార్యక్రమంలో తహసీల్దార్ ఈశ్వర్ రాణి, ఆయా గ్రామాల సర్పంచులు పల్లవి జయరాంరెడ్డి, దుర్గయ్య, అధికారులు, ప్రజలు పాల్గొన్నారు.

**రామచంద్రాపురం డివిజన్‌లో...**



ప్రజా పాలన ధరఖాస్తులను స్వీకరిస్తున్న అధికారులు

**రామచంద్రాపురం, జనవరి 2, ప్రభాతవార్త:** రామచంద్రపురం డివిజన్ పరిధిలోని జ్యోతినగర్‌కాలనీలో కమ్యూనిటీ హాల్‌లో మంగళవారం ప్రజా పాలన గ్రామ సభస్సును నిర్వహించారు. కాలనీలో నిర్వహించిన సదస్సును కార్పోరేటర్ బూరుగడ్డ పుష్పనగేష్ పరిశీలించారు. అర్హులైన ప్రతి ఒక్కరు 6గ్యారంటీల కొరకు ధరఖాస్తులు చేసుకోవాలని కార్పోరేటర్ సూచించారు. కార్యక్రమంలో యాదయ్య గౌడ్, ప్రమోద్ గౌడ్, సతీష్, పవన్, నాగేశ్వర్‌రావు, సీఎం మల్లేష్, ఏఈ ప్రభు ఖాజా తదితరులు పాల్గొన్నారు.

## కొనసాగుతున్న ప్రజా పాలన కార్యక్రమం

**నర్సాపూర్, జనవరి 2, ప్రభాతవార్త:**

తెలంగాణా ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 6 గ్యారంటీల దరకాస్తుల స్వీకరణ లో బాగంగా ఈనెల 2 నర్సాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని 7 వ వార్డు , 8 వ వార్డుల్లో ఆవార్డు కౌన్సిలరన్‌ల అధ్వర్యంలో ప్రజాపాలన గ్రామ సభలు నిర్వహించారు.అంతేగాక మండల పరిధిలోని గ్రామాల్లో మంగళవారం చిప్పల్‌తుర్తి, జక్కపల్లి, తదితర గ్రామాల్లో ఈ ప్రజా పాలన గ్రామ సభలను నిర్వహించారు.ఈ సందర్బంగా మున్సిఫల్ కమీషనర్ వెంకట్‌గోపాల్ మాట్లాడుతూ ఈ గ్రామ సభల్లో మొదటగా రాష్ట్ర ముఖ్యమంత్రి సందేశం వినిపించడం జరుగుతుందన్నారు.ఈ అభయ హస్తం గ్యారంటీ పథకాలు మహాలక్ష్మి పథకం,రైతుభరోసా పథకం,ఇందిరమ్మ ఇండ్లు, గృహజ్యోతి,చేయూత పథకాల గురించి ప్రజలందరికి వివరించడం జరిగిందన్నారు.గ్రామ సభలకు వచ్చిన ప్రజల సౌకర్యార్థం మహిళలకు, పురుషులకు, దివ్యాంగులకు,వయోవృద్ధులకు ప్రత్యేక కౌంటర్‌లు ఏర్పాటు చేశామని తెలిపారు.అంతేగాక టెంట్‌లు, కుర్చిలు తాగునీరు తదితర వసతులు కల్పించినట్లు ఆయన తెలిపారు. ఈకార్యక్రమంలో ఆర్డీవో శ్రీనివాసులు, కౌన్సిలర్ లు గొల్ల రుక్మమ్మ, పంబళ్ల రాంచందర్, మున్సిపల్ కమీషనర్ వెంకట్ గోపాల్, డిప్యూటీ తహశీల్దార్ మహేశ్, మున్సిఫల్ మేనేజర్ మధుసూధన్. వైద్య సిబ్బంది,మున్సిఫల్ సిబ్బంది,ఇతర శాఖల అధికారులు, ప్రజలు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మున్సిపల్ కమిషనర్ వెంకట్‌గోపాల్ తదితరుతలు